క్లుప్తంగా

శ్రీవారి సేవలో మాజీ ఎమ్మెల్యే విశ్వ



శ్రీవారిని దర్శించుకుని బయటకు వస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ విశ్వ

ఉరవకొండ: తిరుమల వేంకటేశ్వర స్వామిని ఉరవకొండ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి బుధవారం కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ విరామ దర్శన సమయంలో విశ్వేశ్వరరెడ్డి, ఆయన సతీమణి భువనేశ్వరి, తనయుడు వై.ప్రణయ్‌రెడ్డి స్వామి సేవలో పాల్గొన్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో మాజీ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను ఆలయ అధికారులు సత్కరించారు. శ్రీవారిని దర్శించుకున్న వారిలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న ఉన్నారు.

జోరుగా కల్వర్టుల నిర్మాణం

కూడేరు: మండల పరిధిలోని గొటుకూరు గ్రామానికి వెళ్లే మార్గంలో సుమారు రూ.10 లక్షల వ్యయంతో రెండు చోట్ల నిర్మిస్తున్న కల్వర్టు పనులు చురుగ్గా సాగుతున్నట్లు పీఆర్ జేఈ శేషయ్య బుధవారం తెలిపారు. ఏఐబీ గ్రాంట్ కింద అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారి నుంచి గొటుకూరు గ్రామానికి 1.8 కి.మీ సిమెంట్ రోడ్డు, కల్వర్టు నిర్మాణాలకు సుమారు రూ.1.42 కోట్లు నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఇప్పటికే 80 శాతం సిమెంట్ రోడ్డు నిర్మాణం జరిగిందన్నారు. కల్వర్టుల నిర్మాణం పూర్తి కాగానే మిగిలిన రోడ్డు పనులను ఈ నెలాఖరుకు పూర్తి చేస్తామన్నారు.

అనారోగ్యంతో రేషన్ డీలర్ మృతి



డీలర్ బచ్చలయ్య (ఫైల్)

కూడేరు: మండల పరిధిలోని కొర్రకోడుకు చెందిన రేషన్ షాపు డీలర్, వైఎస్సార్‌సీపీ నేత బచ్చలయ్య (55) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య సాయిలీల, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ నారాయణరెడ్డి, తహసీల్దార్ శేషారెడ్డి, సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్ తదితరులు బచ్చలయ్య మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు శివలాల్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు గంగాధర్, నాయకుడు తుప్పటి హరీష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, నేతలు వెంకటరామిరెడ్డి, వెంకటేష్, చౌడప్ప, ఎర్రప్ప తదితరులున్నారు.

నేడు వరుణయాగం

రాయదుర్గం: వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులకు మేలు చేకూర్చాలని కోరుతూ పట్టణంలోని ప్రసిద్ధి చెందిన స్వయంభు జంబుకేశ్వర స్వామి ఆలయంలో గురువారం ఉదయం 6:30 నుంచి మధ్యాహ్నం వరకు వరుణ యాగం చేస్తున్నట్టు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి తెలిపారు. రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. నాలుగేళ్లు విస్తారంగా కురిసిన వర్షాలు ఈ ఏడాది మాత్రమే ముఖం చాటేసి రైతుకు తీరని నష్టాన్ని మిగిల్చాయని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంతో పాటు 5 మండలాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు కూడా రైతులతో కలసి ఈ యాగంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం

రాయదుర్గం రూరల్: రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు 74 ఉడేగోళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఫణీంద్ర నాథ్ తెలిపారు. అండర్–17లో జి.మహేశ్వరి, అండర్ 14లో కె.ఖుషి, సి.కరణ్ దేవరాజ్ ఎంపిక కావడం పట్ల హెచ్‌ఎంతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు పసుపులేటి రామాంజినేయులు, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు. రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచి, పాఠశాల కీర్తిని చాటాలని ఆశీర్వదించారు.

కుందుర్పి ఎంపీడీఓగా లక్ష్మీనరసింహస్వామి



కుందుర్పి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నూతన ఎంపీడీఓగా లక్ష్మీనరసింహస్వామి బుధవారం బాధ్యతలు చేపట్టారు. అన్నమయ్య జిల్లా నుంచి బదిలీపై ఆయన ఇక్కడికొచ్చారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ఉన్న వెంకటనాయడు బ్రహ్మసముద్రం ఏఓగా వెళ్లారు. ఈసందర్భంగా ఎంపీడీఓను వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ పాలాక్షి, ఎంపీపీ కమలమ్మ, మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి సన్మానించారు.

దుర్గం'పైన' దృష్టి లోపం!



ప్రధాన రహదారిలో పనిచేయని సీసీ కెమెరా



కణేకల్లు రోడ్డులో అలంకార ప్రాయంగా మారిన సీసీ కెమెరా

- రాయదుర్గంలో పనిచేయని సీసీ కెమెరాలు
- దొంగల హల్‌చల్
- పట్టని పోలీసులు

రాయదుర్గం: రాయదుర్గంలో సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. ముఖ్య కూడళ్లలో అలంకార ప్రాయంగా మారాయి. పోలీసులు కూడా కీలక వ్యవస్థపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండడంతో నేరాలు ఛేదించలేని దశకు చేరుతున్నాయి. పట్టణంలోని టీచర్స్ కాలనీ, జేఆర్‌ఎస్ కాలనీ, శాంతినగర్ ఏరియాల్లో ఇటీవల దొంగలు బీభత్సం సృష్టించారు. విలువైన బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. ఆ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు లేకపోవడంతో సులువుగా పని కానిచ్చేశారు.

పోలీసుల ఆదేశాలు బేఖాతరు..

పట్టణంలోని ముఖ్య దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సంబంధిత యజమానులకు పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. దీన్ని కొందరు పాటిస్తున్నా, చాలా మంది పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. భారీ మూల్యం చెల్లించుకుంటున్నారు.

పోలీసు గస్తీ పెరగాలి

రాత్రి వేళ గస్తీ నిర్వహించే పోలీసులు ప్రధాన రహదారుల్లో మాత్రమే కాకుండా నేరాలు, చోరీలు జరిగే ప్రాంతాల్లో సంచారం పెంచాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఈ వ్యవస్థ మెరుగుపడితేనే దొంగతనాలకు అడ్డుకట్టు వేయడం సాధ్యమవుతుందని చెబుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..



ప్రధాన రహదారుల్లో ఇప్పటికే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఎక్కడైనా మరమ్మతులు చేయాల్సి ఉంటే సత్వరం చేయిస్తాం. ముఖ్య కూడళ్లు, కాలనీలను కలిపే దారులను గుర్తించి అలాంటి చోట కూడా ఏర్పాటు చేస్తాం. దుకాణాలు, ఆలయాలు, శివారు ప్రాంతాల్లో ఉండే గృహాల వద్ద సీసీ కెమేరాల ఏర్పాటుకు యజమానులు సహకరించాలి.

– బీ శ్రీనివాసులు, డీఎస్పీ, కళ్యాణదుర్గం

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే సీఎం ఆకాంక్ష

రాయదుర్గంటౌన్: ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం అందించాలనే గొప్ప ఆకాంక్షతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆరోగ్య సురక్ష కార్యక్రమం తీసుకొచ్చారని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప పేర్కొన్నారు. పట్టణంలోని 18వ సచివాలయం పరిధిలోని 31,32 వార్డు ప్రజలకు బళ్లారి రోడ్డు హెచ్‌పీ పెట్రోల్ బంక్ పక్కన గల డీఆర్‌ఎల్ భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని 32వ వార్డు కౌన్సిలర్ కొంతం దేవరాజు, 31వ వార్డు ఇన్‌చార్జ్ కృష్ణమూర్తితో కలిసి చైర్‌పర్సన్ ప్రారంభించారు. ప్రపంచంలోనే లేని విధంగా రాష్ట్రంలో వైద్య క్యాంపులు ఏర్పాటు చేసి తొలి దశలోనే వ్యాధులను గుర్తించి ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యం అందించే కార్యక్రమం జరుపుతున్నట్లు చెప్పారు. ప్రజల జీవనంలో మార్పులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్న సీఎం జగన్ ఈ రాష్ట్రానికి సీఎంగా ఉండడం అదృష్టమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, మేనేజర్ ప్రసాద్, కౌన్సిలర్లు పొరాళ్ల గోవిందరాజులు, తట్టే మంజునాథ, వార్డు ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివకుమార్, పట్టణ కన్వీనర్ అరవా శివప్ప ఉన్నారు.

శెట్టూరు ఎస్‌ఐగా రాంభూపాల్



శెట్టూరు: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా రాంభూపాల్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన శ్రీసత్యసాయి జిల్లా నుంచి ఇక్కడికి వచ్చారు. గతంలో ఎస్‌ఐగా పనిచేసిన ఎస్‌ఐ యువరాజ్ కళ్యాణదుర్గం పట్టణ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఎస్‌ఐకు సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు.

చిట్టి చేతులతో.. గట్టి చేతలు తగునా సారూ..



నో అంటే ఏం పనిష్మెంట్ ఇస్తాడోనని భయపడిన పిల్లలు ఆ బస్తాలను మోసి ఆటోలో వేశారు.

కణేకల్లు: విద్యార్థులు కూలీలుగా మారారు. టీచర్ చెప్పిన దానికి నో అంటే ఏమంటాడోననే భయంతో ఓకే... ఓకే సార్... మీరు అప్పగిచ్చిన పని చేస్తామంటూ పనికానిచ్చారు. స్థానికులు సెల్‌ఫోన్‌లో ఈ ఫొటోలు క్లిక్‌మన్పించి సోషల్‌మీడియాలో వైరల్ చేశారు. ఈ ఘటన కణేకల్లు మండలంలోని మాల్యం జెడ్పీ హైస్కూల్ ఆవరణంలో చోటు చేసుకొంది. బుధవారం ఇన్‌చార్జ్ హెచ్‌ఎం హిదాయితుల్లా కూలీలతో చేయించాల్సిన పుస్తకాలు మూటలు ఎత్తే పనిని విద్యార్థులతో చేయించారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

ఉరవకొండ: అనంతపురంలోని ఆర్డీటీ ఫుట్‌బాల్ స్టేడియంలో ఇటీవల జరిగిన అండర్–14, 17 బాలికల, బాలుర ఫుట్‌బాల్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ నాగరత్న, ప్రధానోపాధ్యాయుడు రవీంద్రరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక పాఠశాల ఆవరణలో సత్తా చాటిన విద్యార్థులను అభినందించారు. అండర్–14 లో రుచితశ్రీ, అండర్–17 విభాగంలో లాస్యప్రియ, చిదానందసాయి ఎంపికైనట్లు తెలిపారు.

ఘనంగా పూర్ణానందస్వామి జన్మదినం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని దొడగట్ట రోడ్డులో బుధవారం పూర్ణానందస్వామి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి పూజలు, హోమం చేపట్టారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. స్వామి శిష్యులు, పూర్ణనందస్వామి భక్తులు పాల్గొన్నారు.

కరువు మండలాల జాబితాలో బెళుగుప్పను చేర్చాలి



జేసీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

బెళుగుప్ప: ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో బెళుగుప్ప మండలాన్ని చేర్చాలని మండల రైతు సంఘం, వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్‌కు వినతిపత్రం అందించారు. ఖరీఫ్ సీజన్‌లో మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో సుమారు 35 వేల ఎకరాల్లో పంటలు సాగు చేసిన రైతులు నష్టాల పాలయ్యారన్నారు. రబీలో నేటి వరకూ తీవ్ర వర్షాభావంతో సుమారు 20 వేల ఎకరాల్లో విత్తన సాగు చేపట్టలేని దుస్థితి నెలకొందని వాపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో కరువు మండలంగా ప్రకటించి రైతాంగాన్ని ఆదుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్న, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, బెళుగుప్ప సహకార సంఘం అధ్యక్షుడు శివలింగప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, రమనేపల్లి సర్పంచ్ రమేష్, పార్టీ బీసీ సెల్ విభాగం నాయకులు పురుషోత్తం రాజు తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం



కూడేరు: మండల పరిధిలోని కమ్మూరుకు చెందిన బోయ అనూష (17) అనే బాలిక అదృశ్యమైనట్లు బుధవారం పోలీసులు తెలిపారు. మంగళవారం వేకువజామున ఇంటి నుంచి అనూష వెళ్లిపోయినట్లు తల్లి రామలక్ష్మమ్మ ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తొలి రోజు 78 శాతం పంపిణీ

రాయదుర్గంటౌన్: పట్టణంలో మొత్తం 6,791 మందికి వివిధ రకాల పింఛన్లను పంపిణీ చేయాల్సి ఉండగా, మొదటి రోజు బుధవారం సాయంత్రం నాటికి 78 శాతం మందికి పంపిణీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు.

జల చౌర్యం అరికట్టండి

బొమ్మనహాళ్: దర్గాహొన్నూరు హెచ్చెల్సీ సెక్షన్ పరిధిలో హెచ్చెల్సీ సాగునీటిని నాన్ ఆయకట్టుదారులు మోటార్లు పెట్టుకొని జలచౌర్యానికి పాల్పడుతున్నారని, దాన్ని అరికట్టాలని గోవిందవాడ, బొల్లనగుడ్డం, కల్లుహోళ గ్రామాల రైతులు కణేకల్లు హెచ్చెల్సీ డీఈ మద్దిలేటిని కోరారు. బుధవారం దర్గాహొన్నూరు హెచ్చెల్సీ సెక్షన్ పరిధిలోని 9వ బ్రాంచ్ కాలువ పరిధిలో డీఈ పర్యటించారు.

జై కిసాన్ ఫౌండేషన్ సేవలు ఎనలేనివి

ఉరవకొండ: నియోజకవర్గంలో రైతుల అభ్యున్నతికి ఉరవకొండ జై కిసాన్ ఫౌండేషన్ సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు ఎనలేనివని తహసీల్దార్ శ్రీధర్ మూర్తి కొనియాడారు. బుధవారం పెద్దముస్టూరు వేరుశనగ పొలాల్లో పనులు చేసుకుంటున్న రైతులు, రైతు కూలీలకు అన్నప్రసాదం అందజేశారు. మండల సర్వేయర్ రత్నాకర్, జై కిసాన్ సభ్యులు సురేంద్ర,తదితరులు పాల్గొన్నారు.

ఓటీఎస్ పత్రాల పంపిణీ

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 8వ సచివాలయం పరిధిలో నలుగురికి బుధవారం ఓటీఎస్ కింద శాశ్వత గృహ హక్కు పత్రాలను కౌన్సిలర్ గౌని లావణ్యతో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అందజేశారు. కొందరికి పెండింగ్‌లో ఉన్న ఓటీఎస్ పత్రాలు మంజూరు కావడంతో 8వ సచివాలయ పరిధిలో బుధవారం మున్సిపల్ కార్యాలయంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, పట్టణ కన్వీనర్ అరవా శివప్ప, కౌన్సిలర్లు గోవిందరాజులు, శ్రీలక్ష్మీ, శారదమ్మ, తదితరులున్నారు.

చిరుధాన్యాలకు ప్రభుత్వం మద్దతు ధర

రాయదుర్గం రూరల్: ప్రతి రైతు నుంచి ప్రభుత్వమే మద్దతు ధర చెల్లించి పంటలు కొనుగోలు చేస్తుందని ఏడీఏ లక్ష్మానాయక్ తెలిపారు. క్వింటాల్ జొన్న రూ.3,180, కంది పంటకు రూ.7 వేలు, రాగి పంట రూ.3,846, కొర్ర పంట రూ.2,500 ప్రకారం కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. గ్రామాల పరిధిలో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక

రాయదుర్గం రూరల్: ఎన్‌సీసీ విభాగానికి దేహదారుఢ్య పరీక్షల ద్వారా 25 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రఘురామమూర్తి తెలిపారు. ఎన్‌సీసీ కో ఆర్డినేటర్ జె.కిరణ్ ఆధ్వర్యంలో జాయింట్ కమిషన్ ఆఫీసర్ కౌశలేంద్ర సింగ్ సమక్షంలో బుధవారం విద్యార్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు.

లక్ష్యాన్ని అధిగమించాలి

గుమ్మఘట్ట: జగనన్న కాలనీల్లో ప్రభుత్వం మంజూరు చేసిన నూతన గృహాల లక్ష్యాన్ని అధిగమించాలని డీఎల్‌డీఓ శంకర్ తెలిపారు. కలుగోడు, 75వీరాపురం, జె.వెంకటంపల్లిలో జగనన్న లేవుట్‌లలో నూతన గృహాలను ఎంపీడీఓ నరసింహమూర్తి, తహసీల్దార్ బ్రహ్మయ్యతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలను వేగవంతం అయ్యేలా చూడాలని అసిస్టెంట్ ఇంజినీర్లకు సూచించారు. కాలనీల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రణీతకు సూచించారు.పంచాయతీ కార్యదర్శులు శేవతపద్మిని పాల్గొన్నారు.

ఈఓఆర్‌డీ మాధవరెడ్డి బాధ్యతల స్వీకరణ

బెళుగుప్ప: మండల పరిషత్ కార్యాలయంలో ఈఓఆర్‌డీగా మాధవ రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. తలుపుల మండలంలో గ్రేడ్–1 సెక్రటరీగా ఉంటూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు.

సంక్షిప్త సమాచారం

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కళ్యాణదుర్గం: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించాడు. ఇందిరమ్మ కాలనీకి చెందిన వడ్డే నాగరాజు కొన్ని రోజులుగా కంటి ఆపరేషన్ చేయించుకుని ఇంటివద్దే ఉంటున్నాడు. అనారోగ్యంతో బాధపడుతున్న ఈయన బుధవారం సాయంత్రం మనస్తాపంతో జిల్లేడు ఆకులను తిని ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు.

సీఎంకు రుణపడి ఉంటాం

డి హీరేహాళ్ (రాయదుర్గం): సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి గ్రేడ్–2 ఉపాధ్యాయులంతా రుణపడి ఉంటామని తెలుగు టీచర్ ఉమాదేవి చెప్పారు. మంగళవారం సిద్దాపురం, మలపనగుడి ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ బోజరాజ్‌నాయక్‌తో కలసి నోట్‌బుక్కులు పంపిణీ చేశారు. ఇన్నాళ్లకు సీఎం జగన్ పదోన్నతులు కల్పించి చిరకాల కోరిక తీర్చారని కొనియాడారు. గ్రామస్తులు ఆమెను సన్మానించి అభినందించారు.

ఉచిత పశువైద్య శిబిరం

కూడేరు: గొర్రెలు, మేకలు రోగాల బారినపడకుండా పెంపకందారులు జాగ్రత్తలు తీసుకోవాలని వాటర్‌షెడ్ అడిషనల్ పీడీ సుధాకర్ రెడ్డి సూచించారు. బుధవారం కూడేరు చోళసముద్రంలో ప్రధాన మంత్రి కృషి సంచాయి యోజన పథకం కింద వాటర్ షెడ్ ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలకు ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశు వైద్యులు శ్వేత గొర్రెలను పరీక్షించి వైద్య సేవలందించారు. వాటర్‌షెడ్ చైర్మన్ పెన్నోబులేసు, పీఓ ఈశ్వరయ్య, టీఓ విశ్వనాథ్ రెడ్డి, పాల్గొన్నారు.

పగటి పూట విద్యుత్ సరఫరా చేయాలి

విడపనకల్లు: పగటి పూట విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ ఏఈ సత్యంకు ఎంపీపీ కరణం పుష్పావతి, జెడ్పీటీసీ హనుమంతు, సర్పంచులు, ఎంపీటీసీలు విన్నవించారు. బుధవారం మండలంలోని పాల్తూరు, మాళాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని రైతులతో కలసి విద్యుత్ ఏఈకి సమస్యలు విన్నవించారు. సర్పంచులు కురుబ దేవరాజు, ఉమాశంకర్, మాజీ సర్పంచు కరణం భీంరెడ్డి, హేమంత్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ప్రయోజనం

వజ్రకరూరు: ప్రకృతి వ్యవసాయంతో అధిక ప్రయోజనాలు ఉన్నాయని, రైతులు దృష్టి సారించాలని ఎంపీపీ రమావత్‌దేవి, ఎస్సీ కార్పొరేషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ అధికారి రాజు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని వైకేపీ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయం, రైతులకు విత్తనాల పంపిణీపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఓ చైర్మన్ అమర్‌నాథ్, సర్పంచులు సురేంద్ర, కొర్రాశివాజీనాయక్, ఎంపీడీఓ విజయలలిత, ఎస్సీ కార్పొరేషన్ అధికారులు అరుణకుమారి, గీతావాణి, ధనుంజయ, రవి, పీకానాయక్, మాధవి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

బ్రహ్మసముద్రం: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ పరుశురాముడు సూచించారు. బుధవారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఇటీవల సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ప్రిన్సిపాల్ సత్యవతమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం



పొట్టిశ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పించిన దృశ్యం



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాయదుర్గంటౌన్: అమరజీవి పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో పేదలకు మంచి జరిగేలా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు జరుగుతున్నట్లు వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. కమిషనర్ దివాకర్‌రెడ్డి హాజరుకాగా కౌన్సిలర్లతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గౌని ఉపేంద్రరెడ్డి మాట్లాడుతూ విభజన తరువాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఐదేళ్లు కనీసం రాష్ట్ర అవతరణ దినోత్సవం జరపలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాతే ఏటా నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని జరుపుకుంటుండడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వలిబాషా, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, పట్టణ కన్వీనర్ అరవా శివప్ప, కౌన్సిలర్లు గౌని లావణ్య, శ్రీలక్ష్మీ, శారదమ్మ, పొరాళ్ల గోవిందరాజులు, శ్రీనివాసరెడ్డి, డిష్ గోవిందు, తట్టే మంజునాథ, దేవరాజు, ఫక్రుద్దీన్, పెద్ద వన్నూరుస్వామి, వార్డు ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివకుమార్, దివాకర్, బషీర్ అహ్మద్, రామాంజనేయులు, కృష్ణమూర్తి, పవన్‌కుమార్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమరజీవికి ఘన నివాళి

కళ్యాణదుర్గం: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితమే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరించిందని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మెన్ జయం ఫణి, సీనియర్ నాయకులు సుధీర్, కౌన్సిలర్ లక్ష్మన్న, కో ఆప్షన్ సభ్యుడు అఫ్జల్, నాయకుడు ఉమేష్ పాల్గొన్నారు.

ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం

గుమ్మఘట్ట: రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మండలపరిషత్ కార్యాలయంలో డీఎల్‌డీఓ శంకర్, ఎంపీడీఓ నరసింహమూర్తి పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ భవాని, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స.హ చట్టాన్ని వినియోగించుకోండి



మాట్లాడుతున్న సమాచార హక్కు చట్టం పరిరక్షణ సంఘం జిల్లా అధ్యక్షుడు వన్నూరప్ప

ఉరవకొండ: ప్రతి ఒక్కరూ సమాచారహక్కు చట్టంపై అవగాహన కల్గి ఉండాలని సమాచార హక్కు పరిరక్షణ సంఘం జిల్లా అధ్యక్షుడు వన్నూరప్ప అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో సమాచారహక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్టం అమల్లోకి వచ్చినా కొంతమంది అధికారుల్లో పారదర్శకత, జవాబుదారీతనం లేకపోవడం బాధాకరమన్నారు. ప్రతి ఒక్కరు చట్టాన్ని వజ్రాయుధంలా వాడుకోవాలన్నారు. కార్యాలయాల్లో అడినప్పుడు సమాచారం ఇవ్వకపోతే రూ.25 వేల జరిమానా విధిస్తారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మమత, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్‌యాదవ్, జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షులు షౌకత్‌ఆలీ, ఉరవకొండ నియోజకవర్గ అధ్యక్షులు ఎంపీటీసీ వన్నూర్ సాబ్ తదితరులు పాల్గొన్నారు.

విడపనకల్లు: ఆర్‌టీఐ కార్యకర్తలను వేధించడం సరైంది కాదని సమాచారం అడిగితే ఇవ్వడం మీ బాధ్యత అని సమాచార పరిరక్షణ సంఘం జిల్లా అధ్యక్షులు వన్నూరప్ప అన్నారు. మండల పరిధిలోని ఎన్.తిమ్మాపురంలో సమచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సమాచార పరిరక్షణ సంఘం జితల్లా కార్యదర్శి హరిప్రసాదు యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ షౌకత్ వలి, కార్యకర్తలు రామాంజినేయులు, ఎర్రిస్వామి, నగేష్, గాదిలింగ, బాబు, గోవిందు, రాముడు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న ఎంపీపీ మారుతమ్మ

కళ్యాణదుర్గం రూరల్: గ్రామాల్లో ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని ఎంపీపీ మారుతమ్మ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా అధికారులు తమ శాఖల ప్రగతిని చదివి వినిపించారు. ఈసందర్భంగా ఎంపీపీ, వైస్ ఎంపీపీ లక్ష్మీకాంతమ్మ మాట్లాడుతూ పాలవాయి, చాపిరి, హులికల్లులో రీసర్వే జరుగుతోందని, రైతులు సహకరించాలన్నారు. వర్షాభావం నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. డీటీ నాగరాజు, ఎంఈఓ దిలిప్, హార్టికల్చర్ ఆఫీసర్ కృష్ణతేజ, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

డెంగీ లక్షణాలతో యువతి మృతి

బెళుగుప్ప: బెళుగుప్ప తండాకు చెందిన మేఘన (19) డెంగీ లక్షణాలతో మంగళవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తల్లిదండ్రులు చంద్రకళాబాయి, చంద్రానాయక్ తెలిపిన వివరాలు.. మేఘన అనంతపురంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతోంది. వారం రోజుల క్రితం జ్వరం రావడంతో బెళుగుప్ప, కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రిలో చికిత్సలు చేయించారు. అయినా ఫలితం లేకపోవడంతో అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది.

మద్యం ప్యాకెట్ల ధ్వంసం

రాయదుర్గం: రాయదుర్గం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్), అర్బన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన కర్ణాటక మద్యం టెట్రా పాకెట్లను బుధవారం సీఐలు జయనాథ్‌రెడ్డి, లక్ష్మన్నలతో కలసి ధ్వంసం చేయించామని అడిషనల్ ఎస్పీ రామకృష్ణ తెలిపారు. రూ.5 లక్షలు విలువ చేసే 1,314 లీటర్ల మద్యం రోడ్డు పాలు చేశామన్నారు. కర్ణాటక మద్యం తరలించే వారిపై ఉక్కుపాదం మోపామన్నారు. ఇసుక అక్రమ రావాణపై ప్రత్యేక నిఘా ఉంచేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. కార్యక్రమంలో సెబ్ ఎస్‌ఐ హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

కూడేరు: మరుట్ల–2 కాలనీలో బుధవారం సెబ్ సీఐ నరసా నాయుడు, ఎస్‌ఐ మునిస్వామి ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. శివ, నాగేంద్ర, అశ్వర్థ అనే వ్యక్తులు అక్రమంగా నిల్వ ఉంచిన 32 కర్ణాటక మద్యం బాక్స్‌లను స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేశారు.